క్లుప్తంగా

గర్భిణులకు సీమంతాలు



నెల్లూరు సిటీ: తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని అంబాపురం వైఎస్సార్ నగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సెక్టార్ సూపర్‌వైజర్ స్వరూప అధ్యక్షతన సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ తొలిసారిగా తల్లి నుంచి తాగే ముర్రుపాలు వ్యాధి నిరోధక టీకాలుగా పనిచేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, రాజేశ్వరి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



నెల్లూరు సిటీ: నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్డు పక్కన ఉంటున్న పేదలకు పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు కోగిలి రమేష్‌రాజు, బాబీ, సాయి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



నెల్లూరు(బృందావనం): నవాబుపేటలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం హుండీ కానుకలు లెక్కించారు. ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి పారా కవిత మాట్లాడుతూ స్వామివారికి భక్తులు ఈ ఏడాది ఏప్రిల్ 10 నుంచి ఆగస్టు 6వ తేదీ వరకు కానుకల రూపంలో రూ.1,62,881 సమర్పించారని తెలిపారు. హుండీ లెక్కింపులో దేవస్థానం ప్రధానార్చకుడు కార్తికేయుడుశర్మ, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రైసైకిల్ అందజేత



నెల్లూరు(దర్గామిట్ట): నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాలేనికి చెందిన దివ్యాంగుడు చిన్నయ్యకు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మంగళవారం ట్రైసైకిల్ అందజేశారు. జెడ్పీ నిధులతో కొనుగోలు చేసిన ట్రైసైకిల్‌ను మంగళవారం ఆమె నగరంలోని జెడ్పీ కార్యాలయ ఆవరణలో చిన్నయ్యకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, వెంకట్‌రావు, కామాక్షయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డీపీ రక్తదానం



ప్లేట్‌లెట్స్ దానం చేస్తున్న ఐవీఎస్‌ఆర్ శర్మ

నెల్లూరు(అర్బన్): స్థానిక మద్రాస్ బస్టాండ్ సమీపంలో ఉన్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ విశ్రాంత లెక్చరర్ ఐవీఎస్‌ఆర్ శర్మ మంగళవారం సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్(ఎస్‌డీపీ) రక్తాన్ని దానం చేశారు. సూళ్లూరుపేట శిశు, సంక్షేమ ఆస్పత్రిలో అత్యవసర కేసు కోసం ప్లేట్‌లెట్స్ అవసరం కాగా దానం చేశారు. ఆయన ఇప్పటి వరకు 73 సార్లు రక్తదానం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు ఐవీఎస్‌ఆర్ శర్మను ఘనంగా సన్మానించి సర్టిఫికెట్ అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సింహపురి సంజీవిని మెడికల్స్ మురళీకృష్ణ, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

అవాస్తవాలు ప్రచారం చేస్తే సహించం

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిపై అవాస్తవాలు ప్రచారం చేస్తే సహించేది లేదని టీడీపీ మైనార్టీ నాయకుడు, 30వ డివిజన్ ఇన్‌చార్జి ఆషిక్ ఆలీఖాన్ అన్నారు. నెల్లూరు రూరల్‌లోని కొత్తూరు ఖాదర్ నవాజ్ ఖాన్ ఈద్గా వద్ద మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట షఫీ, హఫీజ్, రఫీ, మస్తాన్, బషీర్ తదితరులు ఉన్నారు.

శిశువుకు తల్లిపాలు వరం



నెల్లూరు(అర్బన్): మాట్లాడుతున్న డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరి



నెల్లూరు(వీఆర్సీ సెంటర్): కపాడిపాళెంలో..

• డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరి

నెల్లూరు(అర్బన్): నవజాత శిశువుకు తల్లిపాలే వరమని, ప్రకృతి ప్రసాదించిన పౌష్టికాహారమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ఉమామహేశ్వరి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పొదలకూరురోడ్డులోని జేవీఆర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ పారామెడికల్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమామహేశ్వరి మాట్లాడుతూ బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలే శ్రేష్టమని తెలిపారు. ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కుసుమకిరణ్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన అర్ధగంట లోపే ముర్రుపాలు పట్టించాలన్నారు. అనంతరం పలువురు తల్లులు, గర్భిణులకు ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ అసోసియేషన్ నాయకులు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ రీనాభారతి, పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, అధ్యక్ష, కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, కోశాధికారి దేవరకొండ శ్రీనివాసులు, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, మహబూబ్‌బాషా, శ్రీధర్‌రావు, శంకరరావు, రమేష్ పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఎంతో ప్రయోజనం

నెల్లూరు(అర్బన్): పుట్టిన బిడ్డకు తక్షణమే తల్లి పాలు పట్టించడం ద్వారా తల్లి, బిడ్డకు ఎంతో మేలు కలుగుతుందని ఎనెల్ ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ హారిక తెలిపారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్థానిక మాగుంట లేఅవుట్‌లోని ఎనెల్ ఆస్పత్రిలో గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో పలువురు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అనంతరం డాక్టర్ హారిక మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డ ఎదుగుదలకు ఎంతగానో దోహదం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సుగుణ, డాక్టర్ లావణ్య, చైర్మన్ దశరథనాగేంద్రప్రసాద్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రణీత్ పాల్గొన్నారు.

అమృతంతో సమానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని, అవి అమృతంతో సామానమని ఐసీడీఎస్ సీడీపీఓ అన్నపూర్ణ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్థానిక వెంకటేశ్వరపురం సెక్టార్ పరిధిలోని వైకుంఠపురం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి తల్లి తన బిడ్డకు రెండు సంవత్సరాల వరకు తప్పనిసరిగా పాలివ్వాలని సూచించారు. పౌష్టికాహారం విధిగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీరాజ్యం, కార్యకర్తలు లక్ష్మీప్రసన్న, నన్నెమ్మ, రమణమ్మ, భాగ్యలక్ష్మి, మమత తదితరులు, పాల్గొన్నారు. అలాగే గాంధీనగర్–2లోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ సుజాత మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను గర్భిణులు, బాలింతలకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మీనమ్మ, సుజాత, వహీద, మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేవుడిచ్చిన వరం

తల్లిపాలు బిడ్డకు దేవుడిచ్చిన వరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం రంగనాయకులపేట సెక్టార్ పరిధిలోని కపాడిపాళెం ఏడబ్ల్యూసీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ ముర్రుపాలు తాగడం ద్వారా వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శైలజ, సుబ్బరత్నమ్మ, లలిత, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు(వీఆర్సీ సెంటర్): వైకుంఠపురంలో..



అవగాహన సదస్సులో పాల్గొన్న డాక్టర్లు, వైద్యసిబ్బంది

రైతు ఉత్పత్తి సంఘాలను బలోపేతం చేద్దాం



నెల్లూరు(దర్గామిట్ట): రైతు ఉత్పత్తి సంఘాలను బలోపేతం చేసేందుకు మంగళవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో జిల్లాస్థాయి అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా అభివృద్ధి అధికారి డాక్టర్ బాబు రైతు ఉత్పత్తి సంఘాల రకాలు, వాటిని ఏర్పరచిన సంస్థల గురించి వివరించి సంఘాలు బలోపేతం కావడానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు వివరించారు. జిల్లా సహాయ అధికారి గురప్ప రైతు ఉత్పత్తి సంఘాలు రిజిస్ట్రేషన్ చేసుకునే విధానం, నిర్వహించాల్సిన రికార్డులు, డాక్యుమెంట్లు, సమావేశాలు, ఆడిట్ వంటి విషయాలపై వివరించారు. జిల్లా వ్యవసాయాధికారిణి పి.సత్యవాణి రైతు ఉత్పత్తి సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావడానికి పురుగుమందులు, ఎరువులు, విత్తనాలు అందించేందుకు, లైసెన్సులు పొందేందుకు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. జిల్లా ఉద్యాన అధికారి ప్రేమలత తమ శాఖ ద్వారా సంఘాలను బలోపేతం చేసేందుకు వివిధ స్కీంల నుంచి లభించే ఆర్థిక పరమైన సహాయ సహకారాలను అందించనున్నట్లు తెలిపారు. జిల్లా మార్కెటింగ్ అధికారి అనిత కుమారి తమ శాఖ నిర్వహించే గిడ్డంగులలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కొనుగోలు చేసిన ఉత్పత్తులను నిల్వ చేసుకుని మంచి ధరలు వచ్చిన సమయంలో అమ్ముకుని లాభాలు సాధించాలని తెలిపారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ రైతు ఉత్పత్తి సంఘాలకు బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయం అందించి బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని 37 రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదాలతో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి భేటీ



నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం నగరంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారు చర్చించారు.

సదస్సును జయప్రదం చేయండి

నెల్లూరు(బారకాసు): ఆదివాసీలు చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా ఈ నెల 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్న ఆదివాసీ అఖిల భారత సదస్సును జయప్రదం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కో–కన్వీనర్ జె.బాబు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో పౌరహక్కుల సంఘం సభ్యులు వెంకటేశ్వర్లు, కేశవులు, బ్రహ్మం, సుబ్బారావు, శీనయ్య, అబ్బాయిరెడ్డి, శ్యాంప్రసాద్, శివకోటయ్య, గోపాల్, వేణు తదితరులు పాల్గొన్నారు.

'శ్రీహరి స్వర్ణ కంఠాభరణాలు' పుస్తకావిష్కరణ

నెల్లూరు(బృందావనం): ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించేందుకు ముంగర శ్రీకంఠేశ్వరరావు రచనలు ఉపయుక్తమని కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు తెలిపారు. శ్రీహరిని స్తుతిస్తూ కవిభూషణ, కళానిధి ముంగర శ్రీకంఠేశ్వరరావు రచించిన 'శ్రీహరి స్వర్ణ కంఠాభరణాలు' ఆధ్యాత్మిక కీర్తనల పుస్తకాన్ని మంగళవారం సుబేదారుపేటలోని ట్రస్ట్ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్.సత్యనారాయణ, ఎం.గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 20వ డివిజన్ న్యూ కావేరి అవెన్యూలో రూ.10 లక్షల నిధులతో కల్వర్టు పనులకు మంగళవారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చేజర్ల మహేష్, దారామల్లి, షేక్ ఖాదర్‌బాషా, పోతురాజు రవి, దిలీప్‌రెడ్డి, ఎం.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అలాగే 17వ డివిజన్ పార్థసారథినగర్‌లో రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఊటుకూరు దత్తాత్రేయ, ఊటుకూరు లక్ష్మయ్య, పాంత్రాంగి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌లో హర్ ఘర్ తిరంగా..



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విద్యార్థులు

నెల్లూరు(టౌన్): స్థానిక పొదలకూరురోడ్డులోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం పౌర సంబంధాల శాఖ, విద్యాశాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. సమీప పాఠశాలల విద్యార్థులు ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈఓ రామారావు మాట్లాడుతూ జాతీయ జెండా విశిష్టతను వివరించారు. క్షేత్ర ప్రచార అధికారి నాగసాయి సూరి మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో ఎగ్జిబిసన్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పౌర సంబంధాలశాఖ డీడీ సదారావు, హెడ్‌మాస్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్యశిబిరానికి విశేష స్పందన



దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

నెల్లూరు(అర్బన్): స్థానిక బుజబుజనెల్లూరు శివాజీ కాలనీలోని ఎంపీపీ స్కూల్‌లో పీహెచ్‌పీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నారాయణ దంత వైద్యశాల డాక్టర్లు మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని దంత పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, కార్పొరేటర్ బద్దెపూడి గిరి మాట్లాడుతూ దంత సమస్యలు గుర్తించిన వారికి నారాయణ వైద్యశాలలో ఉచితంగా వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ ప్రతిమ, డాక్టర్ మనోజ్ఞ, డాక్టర్ సుప్రియ వైద్యసేవలందించారు. రమేష్, పీఆర్వో నరేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాత్యాయిని వ్రతం



నెల్లూరు(బృందావనం): శ్రావణ మాసం మొదటి మంగళవారాన్ని పురస్కరించుకొని నగరంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కాత్యాయిని వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఈఓ జె.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 13, 20, 27 తేదీల్లో కాత్యాయిని వ్రతం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరామ్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టండి

• కమిషనర్ సూర్యతేజ



చిన్నబజార్‌లోని దుకాణాల వద్ద స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నగరంలో పారిశుధ్య పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని శానిటేషన్ అధికారులు, సిబ్బందిని నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. మంగళవారం స్థానిక గాంధీబొమ్మ వద్దనున్న స్వతంత్ర పార్కును కమిషనర్ సందర్శించారు. పార్కు లోపల పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా క్రమం తప్పకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నగరంలోని అన్ని పార్కులు సుందరంగా, ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రామలింగాపురం అండర్‌బ్రిడ్జి పరిసరాల్లోని సిల్ట్ మొత్తాన్ని పూర్తిగా తొలగించి రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. డ్రైనేజ్ సదుపాయాలు లేని ప్రాంతాల్లో నూతన డ్రెయిన్ కాలువల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. బారకాసు సెంటర్‌లో సెంట్రల్ లైటింగ్ కోసం ఏర్పాటు చేసిన కాంక్రీట్ దిమ్మ వాహనాలకు ప్రమాదకరంగా ఉందని గుర్తించి వెంటనే తొలగించాలని కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్థానిక పెద్దబజారులోని పండ్ల దుకాణాలను పరిశీలించిన కమిషనర్ పరిసరాలను స్వచ్ఛందంగా శుభ్రం చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. చెత్త సేకరణ వాహనాలకు క్రమం తప్పకుండా వాటర్ వాష్ చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ చైతన్యరెడ్డి, శానిటేషన్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

వృద్ధులను నిర్లక్ష్యం చేయడం తగదు

• సీనియర్ సివిల్ జడ్జి వాణి



వృద్ధులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాణి తదితరులు

నెల్లూరు(అర్బన్): వృద్ధాప్యంలో బిడ్డలు తమ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం తగదని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి అన్నారు. మంగళవారం స్థానిక పొదలకూరు రోడ్డులో ఉన్న హరిత వృద్ధుల ఆశ్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ వృద్ధుల కోసం 2007లో సీనియర్ సిటిజన్ల పోషణ సంక్షేమ చట్టం అమలులోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ హోమ్ మేనేజర్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



నెల్లూరు(దర్గామిట్ట): వ్యవసాయ రంగానికి సంబంధించి జిల్లాలో మండలానికి ఒక ధాన్యం గోదాము, ధాన్యం ఆరబోసుకునే కల్లాలు, డ్రయ్యర్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు వినయ్ నారాయణ కోరారు. ఈ మేరకు మంగళవారం డీఆర్‌ఓ లవన్నకు ఆయన కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, టార్పాలిన్ పట్టలు తదితర పరికరాలు, జింగ్‌బోరాన్ వంటి సూక్ష్మపోషకాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేమారెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచర్ల మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్, డ్రైనేజ్ సెల్ రాష్ట్ర కన్వీనర్ హనుమారెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ అనిత, జిల్లా ఉపాధ్యక్షుడు సాయిశ్రీనివాస్, బొర్రు అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయండి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

నెల్లూరు(దర్గామిట్ట): రైతులను మోసం చేసి వారి ధాన్యాన్ని దొంగలించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి అరిగెల సాయి కోరారు. ఈ మేరకు నష్టపోయిన రైతులతో కలిసి సీపీఐ ఆధ్వర్యంలో గాంధీబొమ్మ సెంటర్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 434 మంది రైతులు సుమారు రూ.4,66,72,000 విలువ చేసే 2,200 పుట్లు ధాన్యాన్ని సాయిబాబా రైస్‌మిల్ యజమాని శ్రీరాం శేఖర్‌బాబుకు విక్రయించారని, అయితే శ్రీరాం శేఖర్‌బాబు వద్ద నుంచి మరికొంతమంది రైతుల ధాన్యాన్ని దొంగలించి, వారి వ్యక్తిగత మిల్లులో భద్రపరుచుకున్నారని తెలిపారు. దీనిపై రైతులు శ్రీరాం శేఖర్‌బాబును నిలదీయగా తన వద్ద నుంచి మీ ధాన్యాన్ని అమరా విక్రం, పీఆర్ సుధాకర్, శ్రీధర్, రాజశేఖర్, శివ అనే వ్యక్తులు దొంగలించి భద్రపరుచుకున్నారని తెలిపారు. ఈ విషయానికి సంబంధించి రైతులు పలుమార్లు కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులు, పౌరసరఫరాలశాఖ అధికారులు, మంత్రులను కలిసి వారు గోడు విన్నవించుకున్నా పట్టించుకునే నాథుడు లేడని రైతులు ఆవేదన చెందుతున్నారు. రైతుల ధాన్యాన్ని దొంగిలించిన వారి రైస్ మిల్లుల్లో ఇప్పటికీ ధాన్యం నిల్వ ఉందని, వెంటనే స్పందించి తక్షణమే రైతుల ధాన్యాన్ని నిల్వ ఉంచి ఉన్న గొడౌన్లను సీజ్ చేయాలని, శేఖర్‌బాబు నుంచి ధాన్యాన్ని బలవంతంగా అపహరించిన వారిపై దొంగతనం కేసులు నమోదు చేయాలని కోరారు. కాగా డీఆర్వో స్పందిస్తూ ధాన్యం నిల్వ చేసిన గోడౌన్‌లను సీజ్ చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వాటంబేటి నాగేంద్ర, పి.లీలామోహన్, స్టాలిన్, వనజ, రైతులు వెంకటేష్‌కుమార్, నరసింహ, చరణ్, సాయి లత తదితరులు పాల్గొన్నారు.

విచారణ కమిటీ రిపోర్టును బయటపెట్టాలి



నెల్లూరు(దర్గామిట్ట): కేఎస్‌ఆర్ పాఠశాలలో విద్యార్థి మృతి ఘటనపై వేసిన విచారణ కమిటీ రిపోర్టును బయటపెట్టాలని ఆంధ్రప్రదేశ్ విద్యార్థి జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు వారు ఆర్డీఓ లవన్నకు ఆయన కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఆదిత్యసాయి మాట్లాడుతూ కేఎస్‌ఆర్ పాఠశాలలో నిర్మాణంలో ఉన్న భవనం కిటికీ స్లాబ్ కిందపడి మహేంద్ర అనే విద్యార్థి మృతిచెందాడని, ఈ ఘటన జరిగి 10 రోజులు గడుస్తున్నా ఆ భవనం నిర్మించిన కాంట్రాక్టర్, ప్రధానోపాధ్యాయుడు, నిర్మాణ పనులను పర్యవేక్షించిన ఇంజినీర్లపై ఎలాంటి చర్యలు లేవన్నారు. కార్యక్రమంలో హరీఫ్, వెంకటేష్, శివ, గోపి, షరీఫ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాలకు యువత మద్దతు

నెల్లూరు సిటీ: నగరంలోని మినీబైపాస్‌రోడ్డులోని ఆదాల ప్రభాకర్‌రెడ్డి కార్యాలయంలో మంగళవారం యువత ఆదాల ప్రభాకర్‌రెడ్డిని కలిసి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు కల్లూరు లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో యువత కలిశారు. ఈ సందర్భంగా ఆదాల ప్రభాకర్‌రెడ్డికి యువత పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మల్లు సుధాకర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ పేర్నాటి కోటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు మంగళపూడి శ్రీకాంత్‌రెడ్డి, తాడిప్రతి వెంకటేశ్వర్లు, కొండేటి నరసింహారావు, వంశీ, శశి, మధు తదితరులు పాల్గొన్నారు.



ఆదాలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న యువత

చిరుద్యోగుల బలవంతపు తొలగింపులు ఆపండి



నెల్లూరు(దర్గామిట్ట): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచే రాష్ట్రవ్యాప్తంగా చిరు ఉద్యోగులపై నిర్దాక్షిణ్యమైన దాడులను ప్రారంభించిందని, ఐకేపీ, వీఓఏ, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, పారిశుధ్య కార్మికులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలని వైఎస్సార్‌టీయూసీ జోనల్ ఇన్‌చార్జి నారపరెడ్డి డిమాండ్ చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిరుద్యోగులు అడగకనే జీతాలు రెట్టింపు చేసి వారు గౌరవప్రదంగా జీవించే అవకాశాన్ని కల్పించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలను తొలగించడమే కాకుండా భౌతికమైన దాడులకు పూనుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ తతంగమంతా కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు వేలాది రూపాయలు వసూలు చేసుకుని తమ వారిని నియమించుకోవడానికేనని ఆరోపించారు. ప్రస్తుతం పనిచేస్తున్న వారందరికీ రాజకీయ మరకలు అంటించి ఉద్యోగాల నుంచి తొలగించడం దారుణమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ ట్రస్టు ఆధ్వర్యంలో పనిచేస్తున్న 2600 మంది ఆరోగ్యమిత్రలు, ఇతర సేవలు అందిస్తున్న వారిని తొలగించడానికి కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. ఈ చర్యలను ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించి, వారికి బాసటగా నిలబడాలని కోరారు.